క్లుప్తంగా

వెంచర్లకు 'రైతుభరోసా' ఇవ్వొద్దు

డోర్నకల్: పంటలు సాగు చేసే అర్హులైన రైతులనే రైతుభరోసా పథకానికి ఎంపిక చేయాలని మన్నెగూడెం పీఏసీఎస్ పాలకవర్గ సభ్యులు కోరారు. సీరోలు మండలం మన్నెగూడెం పీఏసీఎస్ కార్యాలయంలో ఆదివారం రైతుభరోసాపై సలహాలు, సూచనల కోసం ప్రత్యేక జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. పీఏసీఎస్ చైర్మన్ కొండపల్లి సీతారామిరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో పలువురు సభ్యులు మాట్లాడుతూ.. గ్రానైట్ క్వారీలు, వెంచర్ భూములకు రైతు భరోసా పథకం వర్తింపజేయవద్దని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ ఏడీఏ శోభన్‌బాబు, ఏఓ మురళీమోహన్, ఏఈఓ సుప్రజ, ఎంపీటీసీ సభ్యులు విజయపాల్‌రెడ్డి, సీఈఓ సతీష్, తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ స్టేడియంలో సమస్యలు పరిష్కరించాలి

మహబూబాబాద్ రూరల్: జిల్లా కేంద్రంలో ఉన్న ఎన్టీఆర్ స్టేడియం సమస్యలు పరిష్కరించాలని కాళోజీ వాకర్స్ అసోసియేషన్ గౌరవ సలహాదారులు మైస శ్రీనివాసులు డోలి సత్యనారాయణ అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కాళోజీ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు స్టేడియం సమస్యల పరిష్కరించాలని ఎమ్మెల్యే మురళీ నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అధ్యక్షులు వెంకటరెడ్డి, ప్రధాన కార్యదర్శి వెంకన్న, కోశాధికారి లక్ష్మయ్య, సభ్యులు శ్యామ్, వీరన్న, తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు కేటాయించాలి



కేసముద్రం: అర్హులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని మండలంలోని భూక్యరాం తండా జీపీ శివారు కాలనీలో ఆదివారం తండావాసులు నిరసన తెలిపారు. ఈసందర్భంగా పలువురు తండావాసులు మాట్లాడుతూ.. 2008లో అప్పటి ప్రభుత్వం నిరుపేదలైన 36 మందికి ఇళ్ల స్థలాలు కేటాయిస్తు పట్టాలు ఇచ్చిందన్నారు. ఆ తర్వాత తమకు కేటాయించిన స్థలాలను రద్దు చేశారని, ఇప్పటికైనా అర్హులైన తమను గుర్తించి ఇళ్ల స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నూనావత్ ధర్మా, నరేష్, జమ్మి, మంగిని, బుజ్జి, తారకి, సరోజ, రజిత, శాంతి, మంజుల పాల్గొన్నారు.

'మన్ కీ బాత్' ప్రతి ఒక్కరూ వీక్షించాలి

దంతాలపల్లి: ప్రధాని నరేంద్ర మోదీ దేశ ప్రజల సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన మన్ కీ బాత్‌ను ప్రతి ఒక్కరూ వీక్షించాలని బీజేపీ మండల అధ్యక్షుడు గుండగాని భరత్ అన్నారు. ఆదివారం మన్ కీ బాత్ ప్రసార కార్యక్రమంను బీజేపీ నాయకులతో కలిసి వీక్షించారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు బండి నరేష్, ఎస్సీ మోర్చా మండల అధ్యక్షుడు మహంకాళి సురేష్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా బావి



గార్ల: మండలంలోని పెద్దకిష్టాపురం పంచాయతీ అంజనాపురం గ్రామానికి వెళ్లే రహదారి పక్కనే ప్రమాదకరంగా ఉన్న వ్యవసాయ బావిని వెంటనే పూడ్చాలని గ్రామస్తులు కోరుతున్నారు. అంజనాపురం పెద్దకిష్టాపురం, చిన్నకిష్టాపురం గ్రామాలకు వెళ్లే ప్రజలు ఈ రహదారి గుండా వెళ్లే సమయంలో రాత్రి సమయంలో ఆదిమరిస్తే పెను ప్రమాదం సంభవించే అవకాశం ఉంది. సంబంధిత అధికారులు స్పందించి రహదారి ప్రక్కనే ప్రమాదకరంగా ఉన్న వ్యవసాయ బావిని వెంటనే పూడ్చాలని బాటసారులు కోరుతున్నారు.

ఇళ్ల మధ్య విద్యుత్ స్తంభం



మహబూబాబాద్ రూరల్: మండలంలోని దామ్యతండా గ్రామపంచాయతీ పరిధిలో గల తోకబోడు తండాలో ఇళ్ల మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాలు ప్రమాదకరంగా మారాయని సీపీఐ మండల సహాయ కార్యదర్శి బానోతు లింగ్యానాయక్ తెలిపాడు. తక్షణమే అక్కడి నుంచి మరోచోటికి మార్చి ప్రమాదాలు జరగకుండా చూడాలని కోరాడు. వర్షం వచ్చినప్పుడు విద్యుత్ తీగల ద్వారా ప్రజలకు ప్రాణహాని జరిగే అవకాశం ఉందన్నారు.

వాల్యతండాలో సమస్యల తిష్ట

- బురదమయంగా రహదారులు
- పేరుకుపోయిన చెత్తాచెదారం
- కారు చీకట్లో మగ్గుతున్న గిరిజనులు
- లీకవుతున్న మిషన్ భగీరథ నీరు
- పట్టించుకోని అధికారులు

మరిపెడ రూరల్: మరిపెడ మండలం వాల్యతండా గ్రామ పంచాయతీ పరిధిలో సమస్యలు తిష్టవేశాయి. తండాలోని ప్రధాన వీధులన్నీ బురదమయంగా మారి విపరీతమైన దోమలు వ్యాపిస్తున్నాయి. అదేవిధంగా పురవీధుల్లో చెత్తచెదారం పేరుకపోయి దుర్వాసన వెదజల్లుతుందని గ్రామస్తులు చెబుతున్నారు. అదేవిధంగా గ్రామంలో వీధి దీపాలు లేక తండా వాసులు కారు చీకట్లో కాలం వెల్లదీస్తున్నారు. తండాకు సరఫరా అయ్యే మిషన్ భగీరథ పైపు లైన్ లీకులు ఏర్పడి నీరంతా కలుషితమవుతుందని ప్రజలు వాపోతున్నారు. చెత్త తొలగించాలని అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ జీపీ ట్రాక్టర్‌లో డీజిల్ లేదని చెబుతున్నట్లు తెలిపారు. దీంతో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా వాల్యతండా గ్రామ పంచాయతీ పరిస్థితి దాపురించింది. వానాకాలం మొదలై ఇప్పటికే అడపాదడపా కురుస్తున్న వర్షాలకు తండా వీధుల్లో మురుగునీరు నిలిస్తుంద తెలిపారు. సమస్యలను సంబంధిత అధికారికి గానీ, గ్రామ ప్రత్యేక అధికారి దృష్టికి తీసుకెళ్లిన పట్టించుకోవడం లేదని తండా వాసులు ఆరోపిసుస్తున్నారు. ఇప్పటికైన పై ఉన్నతాధికారులు దృష్టి సారించి వాల్యతండాలో పేరుకపోయిన సమస్యలను తక్షణమే పరిష్కరించాలని గిరిజన వాసులు కోరుతున్నారు.



వాల్యతండాలో బురదమయంగా ప్రధాన రహదారి



నివాసాల మధ్య నిల్వ ఉన్న మురుగు

పట్టించుకోవడం లేదు



గ్రామంలో ఏ సమస్య పరిష్కరించాలన్నా జీపీలో నిధులు లేవని సాకు చెబుతున్నారు. గ్రామంలో కనీస సౌకర్యాలు, సమస్యలను కూడా పట్టించుకోవడం లేదు. దీంతో గిరిజన వాసులు ఇబ్బందులు పడుతూ కాలం వెల్లదీస్తున్నారు. అధికారులు స్పందించి తక్షణమే తండాలో పేరుకపోయిన సమస్యలు పరిష్కరించాలి.

- సురేష్, వాల్యతండా

ఆదివాసీల హక్కుల కోసం పోరాడుదాం



మాట్లాడుతున్న సక్రు

గార్ల: ఆదివాసీల హక్కుల కోసం ఉద్యమాలు నిర్వహించాలని ఏఐటీఎఫ్ రాష్ట్ర నాయకుడు జి.సక్రు పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని చిన్నకిష్టాపురం గ్రామంలో జరిగిన సంఘం సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. బ్రిటీష్ వలస వాదంకు వ్యతిరేకంగా జరిగిన భారత స్వాతంత్ర్య పోరాటంలో జూన్ 30 అత్యంత ప్రాముఖ్యత కలిగిన రోజన ఆదివాసీలు తిరుగుబాటు చేసి వారి హక్కుల కోసం పోరాడిన రోజు అని ఆయన పేర్కొన్నారు. మన భూములు, మన అడవులు సహజ వనరుల రక్షణ కోసం ఐక్యం కావలసిన సమయం ఆసన్నమైందన్నారు. సంతాల్ ఆదివాసీల చారిత్రాత్మక తిరుగుబాటును పోరాటంలో అమరులైన సిద్దు, కాను లాంటి అనేక మంది ఆదివాసీ అమరుల త్యాగాలను స్మరించుకొని, మన సామాజిక ఆర్థిక పరిస్థితులపై జరుగుతున్న దాడులపై ప్రతిఘటించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ సదస్సులో పూనెం లక్ష్మీనారాయణ, రవి, పాపయ్య, సుశీల, కలమ్మ, రాధమ్మ, పాపమ్మ పాల్గొన్నారు.

డంపింగ్ యార్డు పనులు నిలిపివేయాలి



అధికారికి వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

మరిపెడ రూరల్: మండలంలోని గుండెపుడి గ్రామ రెవెన్యూ పరిధిలో మరిపెడ మున్సిపాలిటీకి సంబంధించిన డంపింగ్ యార్డును నిర్మించడాన్ని తక్షణమే నిలిపివేయాలని గుండెపుడి గ్రామానికి చెందిన పలువురు డిమాండ్ చేశారు. ఈ మేరకు తహసీల్దార్ కార్యాలయంలోని అధికారులకు ఆదివారం వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గుండెపుడి గ్రామ రెవెన్యూ పరిధిలోని బంచరాయి సర్వే నంబర్ 430 కలిగి ఉందన్నారు. గ్రామానికి సంబంధం లేని మరిపెడ మున్సిపాలిటీకి చెందిన డంపింగ్ యార్డు ఏర్పాటు చేయడం ఎంతవరకు సమంజసం కాదన్నారు. ప్రజలకు, రైతులకు ఉపయోగపడే మరేదైన నిర్మించుకోవచ్చని, అందుకు మాకు ఎలాంటి అభ్యంతరం లేదన్నారు. కానీ మాకు ఎలాంటి సంబంధం లేని మరిపెడకు చెందిన డంపింగ్ యార్డు ఇక్కడ నిర్మించాలని చూడడం తాము ఎంత మాత్రం సహించేది లేదన్నారు. ఇప్పటికై న రెవెన్యూ అధికారులు స్పందించి మా గ్రామానికి చెందిన భూమిలో డంపింగ్ యార్డు నిర్మించడం ఎంత మాత్రం ఒప్పుకోమన్నారు.

సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలి



సమావేశంలో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు

డోర్నకల్: గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారంపై అధికారులు దృష్టి సారించాలని ఎంపీపీ ధరంసోత్ బాలునాయక్ కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో పలు శాఖల పనితీరుపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. తరచూ విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని, విద్యుత్‌శాఖ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని కోరారు. వ్యవసాయ సీజన్ ప్రారంభమైనందున వ్యవసాయ అధికారులు రైతులకు అందుబాటులో ఉంటూ విత్తనాలు, ఎరువుల కొరత లేకుండా చర్య తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు పాడిశెట్టి కమలారామనాథం, ఎంపీడీఓ శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ తుమ్మ వెంకటరెడ్డి, డీటీ వీరన్న తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



తొర్రూరు: 1989-90 బ్యాచ్ విద్యార్థులు

మహబూబాబాద్ అర్బన్: జిల్లా కేంద్రంలోని బృందావన్ భవన్ వేడుక మందిరంలో కురవి మండల మోదులగూడెం ప్రభుత్వ ఉన్నత పాఠశాల 1984-85 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు సత్యనారాయణ, వెంకన్న, నారాయణ, నర్సయ్య, నిరజ, పద్మ, వాణిశ్రీ, ఉదయశ్రీ, పల్లవి, బుచ్చయ్య, రమేష్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

తొర్రూరు: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1989-90లో ఎస్సెస్సీ పూర్తి చేసిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా జరిగింది. డివిజన్ కేంద్రంలోని వెంకటేశ్వర గార్డెన్‌లో ఆదివారం నిర్వహించిన పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో ఆడి పాడి సందడి చేశారు. అనంతరం పాఠాలు చెప్పిన గురువులు హనుమాండ్ల రంగారెడ్డి, కిషన్‌రావు, సత్యారెడ్డి, లలితా, విజయలక్ష్మీ, రంగారెడ్డిలను పూర్వ విద్యార్థులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కుర్ర శ్రీనివాస్, వజినపల్లి అనిల్‌కుమార్, డాక్టర్ నాగవాణి, సీహెచ్ రాము, రాజు, నిమ్మల వెంకన్న, రాంబాబు, అలువాల సోమయ్య తదితరులు పాల్గొన్నారు.



మహబూబాబాద్ అర్బన్: సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

బైకుపై నుంచి పడి వ్యక్తికి తీవ్ర గాయాలు

దంతాలపల్లి: బైకుపై నుంచి పడి వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన మండల కేంద్రం పెద్దముప్పారం క్రాస్ రోడ్డు వద్ద ఆదివారం సాయంత్రం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రామానుజపురం గ్రామానికి చెందిన ధర్మారపు యాదగిరి ద్విచక్రవాహనంపై మండల కేంద్రానికి వెళ్లే క్రమంలో పెద్దముప్పారం క్రాస్ రోడ్డు వద్ద వాహనం అదుపు తప్పి కింద పడిపోయాడు. గమనించిన స్థానికులు ఎస్సై కరుణాకర్‌కు సమాచారం ఇచ్చారు. సిబ్బందితో అక్కడికి చేరుకున్న ఎస్సై గాయపడిన యాదగిరిని చికిత్స నిమిత్తం 108 వాహనంలో తొర్రూరు ఆస్పత్రికి తరలించారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

తొర్రూరు: విద్యుదాఘాతంతో గేదె మృతి చెందిన ఘటన ఆదివారం మండల పరిధిలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని కంఠాయపాలెం గ్రామానికి చెందిన రైతు కావటి వినోద్‌కు చెందిన గేదెను మేత కోసం వ్యవసాయ క్షేత్రానికి తీసుకెళ్లాడు. మేత మేస్తున్న క్రమంలో ట్రాన్స్‌ఫార్మర్ ఎర్త్ వైర్లు తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. నష్టం వాటిల్లిందని ప్రభుత్వం ఆదుకోవాలని రైతు కోరాడు.

కరువు భత్యం ప్రకటించాలి

బయ్యారం: విశ్రాంత ఉద్యోగులకు నాల్గో విడత కరువు భత్యం వెంటనే ప్రకటించాలని విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా జాయింట్ సెక్రటరీ హన్మంతప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం బయ్యారం బాలికల ఉన్నత పాఠశాలలో జరిగిన సంఘం మండల యూనిట్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పీఆర్‌సీ, మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులు మంజూరు చేయాలని, కార్పొరేట్ ఆసుపత్రుల్లో వైద్యం అందించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సంఘం గౌరవ అధ్యక్షుడు టి.వెంకట్‌రెడ్డి, జిల్లా వైస్ ప్రెసిడెంట్ ఆర్‌వీ ప్రసాదరావు, మండల కార్యదర్శి వై.శ్రీనివాసరావు, ఎస్ సత్తిరెడ్డి, వి.శ్రీనివాస్ రావు, రమాదేవి, అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.

పోటీలకు తరలిన విద్యార్థులు

మహబూబాబాద్ అర్బన్: హైదరాబాద్ ఉప్పల్, ఘట్‌కేసర్ ఎన్ఎఫ్‌సీ కేంద్రీయ విద్యాలయంలో నేడు జరగనున్న జోనల్‌స్థాయి క్రీడలకు ఆదివారం విద్యార్థులు తరలివెళ్లారు. అండర్-17, అండర్-14 కబడ్డీ, అండర్-17లో ఖోఖో పోటీల్లో 12మంది విద్యార్థులు పాల్గొంటారు.

సంక్షిప్త సమాచారం

రైతు పరపతి సంఘం కమిటీ ఎన్నిక





కేసముద్రం: జైకిసాన్ రైతు పరపతి సంఘం మండల కమిటీ అధ్యక్షుడిగా కేసముద్రం విలేజికి చెందిన సంకెపల్లి శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా కల్వల గ్రామానికి చెందిన గండి శ్రీనివాస్ ఎన్నికయ్యారు. ఆదివారం మండల కేంద్రంలోని రెడ్డి ఫంక్షన్ హాల్‌లో ఎన్నిక సమావేశం నిర్వహించారు. సంఘం ఉపాధ్యక్షుడిగా భూలోకరెడ్డి, కోశాధికారిగా కొమ్మాల జయేందర్‌రెడ్డి, సహాయ కార్యదర్శిగా వంగాల కొమ్మాల్ రెడ్డి, గౌరవ అధ్యక్షుడిగా ముదిరెడ్డి అశోక్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులుగా తొమ్మిది మందిని ఎన్నుకున్నారు.

మడేలయ్య పండుగ

మహబూబాబాద్ రూరల్: మడేలయ్య పండగ సందర్భంగా మానుకోట పట్టణ రజక సంఘం ఆధ్వర్యంలో ఆదివారం పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో సంఘం పట్టణ అధ్యక్షుడు దోసపాటి వెంకన్న, ప్రధాన కార్యదర్శి సట్ల రాజు, లాండ్రి షాప్ అధ్యక్షులు చీనూరి వెంకన్న, పట్టణ సలహాదారులు వెంకన్న పాల్గొన్నారు.

లంబాడీల ఐక్యవేదిక ప్రతినిధిగా రామ్మూర్తినాయక్



డోర్నకల్: లంబాడీల ఐక్యవేదిక డోర్నకల్ నియోజకవర్గ లైవ్ అసెంబ్లీ సెక్రెటరీగా సీరోలు మండలం మన్నెగూడేనికి చెందిన రామ్మూర్తినాయక్‌ను నియమిస్తూ రాష్ట్ర చీఫ్ కోఆర్డినేటర్ గుగులోత్ రమేష్‌నాయక్ జాదవ్ నియామక పత్రం జారీ చేశారు.

అపస్మారక స్థితిలోకి యువతి

మహబూబాబాద్ రూరల్: జిల్లా కేంద్రంలోని ఇల్లెందు రోడ్డు ప్రాంతంలో ఆదివారం ఓ యువతి అపస్మారక స్థితిలోకి వెళ్లింది. వివరాలు ఇలా ఉన్నాయి.. జిల్లా కేంద్రంలోని ఇల్లెందు రోడ్డు ప్రాంతంలో ఓ యువతి అపస్మారక స్థితిలో పడి ఉన్నట్లు డయల్ 100కు సమాచారం వచ్చింది. స్పందించి వెంటనే టౌన్ ఎస్సై చల్ల అరుణ సంఘటన స్థలానికి చేరుకుని యువతిని పరిశీలించి 108 ద్వారా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించారు. యువతి అపస్మారక స్థితిలో ఎందుకుపడి ఉందనే విషయంపై పోలీసులు ఆరా తీస్తున్నారు.

వనభోజనాలకు గంగపుత్రులు



మహబూబాబాద్ రూరల్: జిల్లా కేంద్రంలోని గంగపుత్రులు ఆదివారం వనభోజనాలకు వెళ్లారు. ప్రతి ఏటా వర్షాలు సకాలంలో కురవాలని చెరువులు కుంటలు నిండి పంటలు పండాలని కోరుతూ తెలుగు నెలల ప్రకారం ఆరుద్ర కార్తె ప్రారంభం కాగానే గంగపుత్ర కులదేవమైన గంగమ్మ తల్లిని వేడుకుంటూ వన భోజనాలకు గంగపుత్రులు తరలివెళ్లారు. కార్యక్రమంలో గంగపుత్ర సంఘం జిల్లా అధ్యక్షులు మైస నాగయ్య, పట్టణ గంగపుత్ర సంఘ అధ్యక్షులు దేశబోయిన వెంకటస్వామి, కందరబోయిన ఉపేందర్ పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం



మహబూబాబాద్ రూరల్: జిల్లా కేంద్రంలోని వడ్డెర కాలనీకి చెందిన రాపోలు యాకయ్య అదృశ్యమైన ఘటనలో ఆయన కుమారుడు రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నామని టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్ ఆదివారం తెలిపారు. యాకయ్య జూన్ 27వ తేదీన ఇంటి నుంచి పనికి వెళ్తున్నానని చెప్పి వెళ్లి తిరిగి రాకపోవటంతో ఆయన ఆచూకీ కోసం వెతికి ఎలాంటి సమాచారం తెలియకపోవటంతో పోలీసులకు ఫిర్యాదు చేశారన్నారు.

ఆర్టీసీ ఆదాయం పెంపునకు కృషి చేయాలి

తొర్రూరు: ఆర్టీసీ ఆదాయం పెంపునకు కృషి చేయాలని తొర్రూరు డిపో ఇన్‌చార్జ మేనేజర్ శివ ప్రసాద్ కోరారు. ఆదివారం డివిజన్ కేంద్రంలోని ఆర్టీసీ డిపోలో 'లక్ష్మే లక్ష్యం' కార్యక్రమం నిర్వహించారు. ఎస్సెస్సీ, ఇంటర్‌లో ఉత్తమ ఫలితాలు సాధించిన ఆర్టీసీ ఉద్యోగుల పిల్లలను సత్కరించారు. కార్యక్రమంలో ఎస్‌టీఐ రజిత, సిబ్బంది సమద్, కేవై రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రిని కలిసిన బీజేపీ నాయకులు



తొర్రూరు: కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని హైదరాబాద్‌లో తొర్రూరు బీజేపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లేగా రామ్మోహన్‌రెడ్డి, నియోజకవర్గ కన్వీనర్ పూసాల శ్రీమాన్, అర్బన్ అధ్యక్షుడు పల్లె కుమార్, నాయకులు రాజేష్, నవీన్, శివ, గణేష్ ఉన్నారు.

ఎస్సై బంధువునంటూ ఇసుక రవాణా..!

చిన్నగూడూరు: మండలంలోని ఇసుక ట్రాక్టర్లు స్థానిక ఎస్సై బంధువులమంటూ కొందరు ఇసుక అక్రమ రవాణా చేస్తుండగా స్థానికులు పట్టుకుని స్టేషన్‌కు తరలించినా ఎస్సై వదిలేసినట్లు తెలుస్తుంది. 'ఆఫీసర్ దందా' అంటూ ట్రాక్టర్ డ్రైవర్ సంభాషణ ఆదివారం సోషల్ మీడియాలో వీడియో వైరల్‌గా మారింది. ఇసుక అనుమతి ఎస్సై ఇచ్చాడని డ్రైవర్ తోటి ఇసుక డ్రైవర్‌తో చెప్పడం చర్చనీయాంశంగా మారింది. ఇదే విషయమై ఎస్సైని వివరణ కోరగా తమ పేరుతో ఇసుక అక్రమ రవాణా చేస్తే ఉపేక్షించేది లేదని తెలిపారు.

నేడు రాజ్‌భవన్ ముట్టడి



సమావేశంలో పాల్గొన్న సంఘం నాయకులు

మహబూబాబాద్ అర్బన్: మే 5న నిర్వహించిన నీట్ పరీక్ష పత్రాల లీకేజీకి పాల్పడిన దోషులను కఠినంగా శిక్షించాలని పరీక్ష ఫలితాలను రద్దు చేసి తిరిగి నిర్వహించాలని నేడు రాజ్‌భవన్ ముట్టడిని జయప్రదం చేయాలని ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని ఏఐఎస్ఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో ఆదివారం సంఘాల నాయకులు ప్రత్యేక సమావేశం నిర్వహించి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్య మూలంగా 24లక్షల మంది విద్యార్థుల భవిష్యత్ అగమ్యగోచరంగా మారిందన్నారు. నీట్ లీకేజీపై కనీసం స్పందించకుండా కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందన్నారు. పరీక్ష ఫలితాలను రద్దు చేసి తిరిగి నిర్వహించాలని వారు డిమాండ్ చేశారు. రాజ్‌భవన్ ముట్టడికి విద్యార్థి సంఘాల నాయకులు భారీ ఎత్తున తరలిరావాలన్నారు. ఈ సమావేశంలో పీడీఎస్‌యూ, ఎస్ఎస్‌యూఐ, వీజేఎస్, ఏఐఎస్ఎఫ్ఐ, ఏఐవైఎఫ్ విద్యార్థి సంఘాల అధ్యక్ష కార్యదర్శులు దేవేందర్, శ్రావణ్, మనోజ్ కుమార్, చంటి, వెంకటేష్, వికాస్, ప్రవీణ్, అశోక్, హర్ష తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్ వార్డెన్‌ను సస్పెండ్ చేయాలి



నిరసన తెలుపుతున్న విద్యార్థులు

చిన్నగూడూరు: మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర వసతి గృహం వార్డెన్‌ను సస్పెండ్ చేయాలని యూఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థులు హాస్టల్ ముందు ఆదివారం నిరసన చేపట్టారు. ఈసందర్భంగా పలువురు హాస్టల్ విద్యార్థులు మాట్లాడుతూ.. మండల కేంద్రంలోని ఎస్సీ హాస్టల్ కిరాయి భవనం శిథిలావస్థలో ఉండడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. వర్షాకాలం కావడంతో పాత భవనం కురుస్తూ విషసర్పాలు హాస్టల్‌లోకి వస్తున్నాయన్నారు. శనివారం రాత్రి హాస్టల్‌లోకి పాము వచ్చిందని వార్డెన్‌కు ఫోన్‌లో చెబితే వినిపించుకోకుండా డ్రామాలు చేయకండని సమాధానమిచ్చాడని తెలిపారు. ఆదివారం కనీసం హాస్టల్‌ను పరిశీలించడానికి కూడా రాలేదన్నారు. వార్డెన్ స్థానికంగా ఉండకుండా ఎప్పుడోసారి వచ్చి వెళ్తాడని తెలిపారు. హాస్టల్‌లో మెనూ పాటించకుండా సరైన వసతులు లేకుండా మాకు తీవ్రనష్టం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో యుఎస్ఎఫ్ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

6, 7 తేదీల్లో కౌన్సిల్ సమావేశాలు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

మహబూబాబాద్ అర్బన్: ఈనెల 6, 7వ తేదీల్లో సంగారెడ్డి జిల్లాలో జరగనున్న పీడీఎస్‌యూ రాష్ట్ర జనరల్ కౌన్సిల్ సమావేశాలను విజయవంతం చేయాలని సంఘం జిల్లా అధ్యక్షుడు మాదారపు నాగరాజు పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని సంఘం కార్యాలయంలో ఆదివారం జనరల్ కౌన్సిల్ సమావేశాలు కరపత్రాలను నాయకులు ఆవిష్కరించారు. ఈసందర్భంగా జిల్లా అధ్యక్షుడు మాదారపు నాగరాజు మాట్లాడుతూ.. దేశంలో మూడోసారి అధికారం చేపట్టిన నరేంద్ర మోదీ ఫాసిస్ట్ పాలనకు వ్యతిరేకంగా పాఠ్యాంశాలలో మత భావజాలాన్ని పొందుపరుస్తున్నారన్నాడు. దీనిని వ్యతిరేకిస్తూ ఈ కౌన్సిల్ సమావేశాలు నిర్వహిస్తున్నామని, విద్యార్థులు, నిరుద్యోగులు, మేధావులు, నాయకులు అధిక సంఖ్యలో సమావేశాలకు రావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి బోనగిరి మధు, జిల్లా నాయకులు విజయ్, మహేష్ పాల్గొన్నారు.

చలో హైదరాబాద్‌ను విజయవంతం చేయండి

నెహ్రూసెంటర్/గార్ల: గిరిజనుల హక్కుల కోసం జూలై 1వ తేదీన జరిగే చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని లంబాడీ హక్కుల పోరాట సంఘం (ఎల్‌హెచ్‌పీఎస్) జిల్లా అధ్యక్షుడు బోడ రమేష్‌నాయక్ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలో కరపత్రాలను ఆదివారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్టీలకు పదిశాతం రిజర్వేషన్ అమలు, తండాలను రెవెన్యూ గ్రామాలుగా ఏర్పాటు చేయడం, ప్రతి జిల్లా కేంద్రంలో ఐటీడీఏ ఏర్పాటు చేయాలన్నారు. ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలని, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను ఎస్టీల అభివృద్ధికే ఖర్చు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బాలాజీ, జాటోత్ వెంకన్న, దేవేందర్, రమేష్ పాల్గొన్నారు.

సేవలతోనే ఉద్యోగులకు గుర్తింపు



దంతాలపల్లి: సేవలతోనే ప్రభుత్వ ఉద్యోగులకు గుర్తింపు వస్తుందని ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే రాంచంద్ర నాయక్ అన్నారు. మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సీహెచ్‌ఓగా విధులు నిర్వహిస్తూ ఆదివారం పదవీ విరమణ పొందిన బోడ బాలాజీ దంపతులను సన్మానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి విరమణ తప్పనిసరి అని తెలిపారు. ఇప్పటి వరకు వైద్యరంగంలో ప్రజలకు సేవలు అందించారని ఇకపై తన కుటుంబ సభ్యులతో కలిసి ఆయురారోగ్యాలతో సంతోషంగా గడపాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి కళావతి బాయి, జిల్లా ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ వెంకట్ రాములు, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ మురళీధర్ పాల్గొన్నారు.